క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, వడ్లమూడి విజ్ఞాన్ కాలేజి ఏరియా, వేజండ్ల, సుద్దపల్లి గ్రామాల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: రూరల్ మండలం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

ఆర్టీసీ మూడు నూతన బస్సులు ప్రారంభం



పొన్నూరు: ఆర్టీసీ పొన్నూరు డిపోకు మూడు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులు కేటాయించినట్లు డిపో మేనేజరు అజిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ సన్నిధిలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ బస్సులను అధిక ఆదాయం సమకూర్చే బాపట్ల, గుంటూరుకు కేటాయించినట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఉద్యోగులకు శిక్షణ

చేబ్రోలు: గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దారు కె. శ్రీనివాస శర్మ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీవోలకు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ జరిగింది. మండల, గ్రామస్థాయి అధికారులకు పంచాయతీరాజ్ చట్టాలు, ప్రణాళికల తయారీలో కావలసిన విధానాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ టి.ఉషారాణి, శిక్షణ రిసోర్స్ పర్సన్ నిరంజన్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలు



ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలు ఎంతో ముఖ్యమని ఎంపీడీఓ కె.శివ పార్వతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ కె.శివ పార్వతి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ దాసరి అన్నమ్మ మండల పరిషత్ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి సాధించాలంటే అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రాధాన్యం క్రమంలో ఏఏ పనులు చేపట్టాలి, ఎంత వ్యయం అవుతుంది.. నిధుల లభ్యత వంటి అనేక అంశాలపై అందరికీ అవగాహన అవసరమన్నారు. శిక్షణకు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన కరుణ, జాలి రోగులపై చూపించాలి

గుంటూరు మెడికల్: ఏసుక్రీస్తు తన బోధనల ద్వారా ప్రపంచ మానవాళికి శాంతి కలగాలని సూచించారని, ఆయన చూపిన జాలి, దయ, కరుణ, త్యాగ బుద్ధి రోగులపై ప్రతి వైద్యుడు చూపించాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో శుక్రవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ రోగులను సమదృష్టిగా చూడాలని, ఎలాంటి తారతమ్యాలు చూపకూడదన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అనేక మంది డిప్రెషన్, ఆందోళన, కోపంతో ఉన్నారని, ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా శాంతి చేకూరుతోందన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామంలో జీసెస్ లాంటి జన్మించాలని సూచించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు ఏసుక్రీస్తు త్యాగం చేసినట్లుగా కొన్ని త్యాగాలు చేసి, రోగుల ప్రాణాలు కాపాడాలన్నారు. తారతమ్యాలు చూపకుండా అందరిని సమానంగా చూడాలన్నారు. డాక్టర్ సాల్మాన్ సతీష్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ క్రిస్మస్ గీతాన్ని ఆలపించారు.

పౌర్ణమి వెలుగులు



గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో శివునికి చేస్తున్న ప్రత్యేక అభిషేకాలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివునికి పూజలు చేస్తున్న అర్చకులు

కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక గంగా పార్వతీసమేత దండేశ్వరాలయం శివనామ స్మరణతో మారుమోగింది. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పరమేశ్వరశర్మ శివునికి విశేష అభిషేకాలు చేశారు. రాత్రి శివాలింగాకారం, స్వస్తిక్ ఆకారాలతో మహిళలు దీపాలను వెలిగించారు. అదే విధంగా కొత్తమల్లాయపాలెం పర్వతవర్ధని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంతో పాటు ప్రత్తిపాడులోని రెడ్ల రామాలయంలో దీపార్చన చేశారు.
ప్రత్తిపాడు



ప్రత్తిపాడు శివాలయంలో శివలింగాకారంలో వెలిగించిన దీపాలు



కొత్తమల్లాయపాలెం శివాలయంలో మహిళల దీపార్చన

భక్తి శ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు

గుంటూరు రూరల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నల్లపాడు గ్రామంలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున దీపాలు వెలిగించేందుకు భక్తులు భారీగా చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులకు అభిషేకాల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు బిల్వార్చనలు పంచామృతాభిషేకాలు ఆలయ అర్చక స్వామి పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని విశేష పుష్పాలంకరణ చేశారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గోరంట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

నగర శివారుల్లోని గోరంట్లలోని ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామికి సుదర్శన హోమం, సుదర్శన అభిషేకం నిర్వహించారు.

లక్ష దీపోత్సవం..

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలోని శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరశింహస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వెంగళాయపాలెంలో లక్ష దీపోత్సవం.. శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నల్లపాడులో శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ



గోరంట్ల శ్రీవేంకటేశ్వరాలయంలో సుదర్శన అభిషేకం చేస్తున్న అర్చకులు

డిసెంబర్ 11న విజ్ఞాన్‌లో అంతర్జాతీయ సెమినార్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డిసెంబర్ 11 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ 'ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపోరరి విస్టాస్ ఇన్ అప్‌లెయ్యింగ్ (ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల పాటు సెమినార్ జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఫ్రాన్స్ దేశంలోని లయోన్- యూనివర్సిటీ క్లాడే బెర్నార్డ్ నుంచి డాక్టర్ అనిస్ తిలి, ప్రొఫెసర్ జీన్-ఫ్రాంకోయిస్ పాయిస్సన్, ఇన్సా డీ రౌన్ నుంచి ప్రొఫెసర్ థామస్ పాయిస్సన్, డాక్టర్ టట్టైన బెస్సెట్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ వీకే.సింగ్, ఐసీటీ ముంబాయి ప్రొఫెసర్ ఎం.లక్ష్మీకాంతం విచ్చేస్తున్నారని వెల్లడించారు.



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్

ఘనంగా స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సాముండా జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు అధ్యాపకులు

గుంటూరు రూరల్: అతి చిన్న వయస్సులోనే స్వాతంత్య్ర పోరాటానికి సారథ్యం వహించిన గొప్ప గిరిజన నాయకుడు స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సాముండా అని ఆచార్యా ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్సెస్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి తెలిపారు. శుక్రవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖా నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, కమ్యూనిటీ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో జనజాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ బిర్సా ముండా సమాజాన్ని ఏకం చేసి సంప్రదాయ ప్రజాస్వామ్య స్థాపన కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా జనజాతీయ గౌరవదివస్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బిల్కిస్, డాక్టర్ ఎ.పూర్ణిమ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.లక్ష్మి, పి.అపర్ణ పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పొన్నూరు మండలంలో పౌర సరఫరాల శాఖ, ఇతర అనుబంధ శాఖలతో కలసి రేషన్ అక్రమ రవాణా చేసే వారిపై గత రెండు నెలల్లో 29 6ఏ, 27 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి పి కోమలి పద్మ తెలిపారు. మండలంలో రేషన్ అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందని, పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని నల్ల బజారుకు పేదల బియ్యం శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఎస్‌ఓ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి రవాణా చేస్తున్న 8 ఎండీయూ వాహనదారులు, 5 రేషన్ డీలర్లు, అనధికారిక గోడౌన్‌లపై దాడులు చేసి 2,590.12 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని 29 6ఏ, 27 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు.

డాక్టర్ యశస్వి రమణకు సన్మానం

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ యశస్వి రమణను సన్మానించారు. ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ త్వరితగతిన పరిష్కరించాలని, జీజీహెచ్ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈనెల 17న కార్తిక వన సమారాధన కార్యక్రమం గుంటూరు ఎ.టి.అగ్రహారం, సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతుందని, దానికి హాజరు కావాలని సూపరింటెండెంట్‌ను ఆహ్వానించారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం

పెదకాకాని: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, విజ్ఞానాన్ని పొందాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని రెండోరోజు శుక్రవారం ఆమె పెదకాకాని లూథర్ గిరి గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమానికి లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు డాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ పుస్తక సమీక్ష , డ్రగ్స్‌పై అవగాహన, పుస్తకాలు చదవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అనే మాదిరిగా ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలుకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, భావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. గ్రంథాలయంలో రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ నాయకుల చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద సాల్మన్‌రాజు, సెయింట్ జోసఫ్ స్కూల్ ఉపాధ్యాయినీలు రేణుక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో బాలసాహిత్యం, నవలలు, ఆధ్యాత్మిక, సాహిత్య, కథలు, చరిత్ర, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రదర్శించారు. గ్రంథాలయ అధికారి బి.అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజలు పాల్గొని ఆసక్తిగా ప్రదర్శనను తిలకించారు.



పెదకాకానిలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ



ప్రత్తిపాడులో పుస్తక ప్రదర్శన

రేపు శ్రీవేంకటేశ్వరాలయంలో సామూహిక వ్రతాలు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి(పెద్దగుడి) దేవస్థానంలో ఈనెల 17వ తేదీన వేలాది మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. అమరావతిరోడ్డు గోరంట్లలోని ఆలయంలో ప్రత్యేక వ్రతాలకు సంబంధించి కరపత్రాలు శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఆలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుమారు 6 వేల మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నవరం దేవస్థానం పండితులతో, రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పీఠాధిపతులతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం వ్రతం పూర్తయిన తరువాత పీఠాధిపతులు, అన్నవరం వేదపండితుల ఆశీర్వచనం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రత్యేకంగా స్వామికి వజ్రకిరీటం, బంగారు ఆభరణాలతో దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. వ్రతంలో పాల్గొనాలనుకునే దంపతులు 7842102955, 9533931188 సెల్ నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఈనెల 25వ తేదీన ఉత్తర నక్షత్రం సందర్భంగా ఉదయం 10 గంటలకు ఆలయంలో శ్రీ శ్రీనివాస కళ్యాణం జరుగుతుందని తెలిపారు. 30వ తేదీన అమావాస్య సందర్భంగా సాయంత్రం శ్రీకాశీ అన్నపూర్ణాదేవి ప్రదోషకాల పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ యర్రంశెట్టి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ఆళ్ల శివారెడ్డి, గజవల్లి శివన్నారాయణ, కార్యవర్గ సభ్యులు దేవరశెట్టి సురేష్,ఓబులుశెట్టి వెంకటనారాయణ, దేవరశెట్టి సుబ్బారావు, కూనిశెట్టి శ్రీనివాసరావు, సూరే శ్రీనివాసరావు, పూసల శివయ్య, జవ్వాది సుబ్బారావు, జిల్లేపల్లి ముసలయ్య, కటకంశెట్టి శివరామకృష్ణ తదితరులున్నారు.



వ్రతాల కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

మంచి అలవాట్లతో మంచి ఆరోగ్యం

డాక్టర్ కుమారవేలు

గుంటూరు రూరల్: మంచి అలవాట్లతోనే మంచి ఆరోగ్యం కలుగుతుందని రమేష్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ కుమారవేలు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడిలేని ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు కాలుష్యానికి గురికాకుండా మత్తు పదార్థాలు, సిగరెట్, గుట్కా, ఆల్కహాలుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి జీవితం యాంత్రిక జీవన విధానానికి అలవాటు పడ్డారన్నారు. యోగా, వ్యాయామం వంటివి ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఏ రాధాకృష్ణమూర్తి, ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



అతిథిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

లాడ్జిల్లో పోలీసుల సోదాలు

పట్నంబజారు: గుంటూరు నగరంలో లాడ్జిల్లో పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు అరండల్‌పేట, కొత్తపేట, లాలాపేట, పోలీసు స్టేషన్‌ల పరిధిలోని పలు లాడ్జిల్లో ఆయా స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఎవరెవరు వస్తున్నారు. వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. లాడ్జిల యజమానులు వచ్చే కస్టమర్ల వివరాలు తీసుకోవాలని, గుర్తింపు కార్డులు సేకరించాలని, లాడ్జిలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు.





పెదకాకాని శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చారు. కార్తిక దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.
-పెదకాకాని

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com